అస్తవ్యస్తంగా వైకుంఠధామాలు

- రెండేళ్లకే కూలిన గోడలు,
  పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు

రామగుండం: గత ప్రభుత్వం రూ.లక్షల నిధులు వెచ్చించి గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు వినియోగించకుండానే కూలిపోతున్నాయి. నాసిరకం నిర్మాణాలు, యోగ్యత లేని స్థలాల్లో నిర్మాణాలతో చెత్త డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. అంతర్గాం మండల పరిధిలోని గోదావరి నది పరివాహక ప్రాంతాలైన లింగాపూర్, విలేజి అంతర్గాం, గోలివాడ, మద్దిర్యాల, పొట్యాల తదితర గ్రామాల్లో గోదావరినది ఒడ్డున నిర్మించిన వైకుంఠధామాలను వినియోగించుకోకపోగా బహిరంగ ప్రదేశాల్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. హిందూధర్మం ప్రకారం గోదావరి నది ఒడ్డున అంత్యక్రియలు నిర్వహిస్తే పుణ్యఫలం దక్కుతుందని నమ్ముతుంటారు. ప్రతి ఒక్కరూ నది ఒడ్డున ఉన్న వైకుంఠధామాల్లో అంత్యక్రియలు నిర్వహించడం లేదు. కాగా కొన్ని గ్రామాల్లోని వైకుంఠధామాల్లో నల్లా పైపులు, విద్యుత్ బోర్డులు, స్విచ్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రాయదండి, గోలివాడ, విలేజి అంతర్గాం, విసంపేట, పొట్యాల, ఎల్లంపల్లి తదితర గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు రూ.11.50లక్షలు, టీటీఎస్ అంతర్గాం, లింగాపూర్, కుందనపల్లి, బ్రాహ్మణపల్లి, ముర్మూర్, ఎగ్లాస్‌పూర్, పెద్దంపేట, మద్దిర్యాల, ఆకెనపల్లి, సోమనపల్లి గ్రామాల్లో వైకుంఠధామాలు రేకులతో నిర్మించడంతో రూ.8లక్షలు కేటాయించారు. సౌకర్యాలు కల్పించి వైకుంఠధామాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


గోదావరి నది ఒడ్డున ఉన్న గోలివాడ వైకుంఠధామం

క్లుప్తంగా

దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత


వీల్‌చైర్లు అందజేస్తున్న కుమార్‌స్వామి

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్‌కు చెందిన దివ్యాంగులకు గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు రేండ్ల కుమార్‌స్వామి తన సొంత ఖర్చులతో రూ.20వేల విలువ గల వీల్‌చైర్లు అందజేశారు. గోకుల్‌నగర్‌కు చెందిన కొయ్యడ అనిల్, గంగినేని పవన్ కుమార్ నడవలేని స్థితిలో ఉన్నారని కుమార్‌స్వామి దృష్టికి తీసుకరాగా వీల్‌చైర్లు అందజేశారు. నిరుపేదలకు సాయం చేయాలనే ఉద్దేశంతో వీల్ చైర్లను పంపిణీ చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని, రాబోయే రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులు కొయ్యడ కిష్టయ్య, కొయ్యడ కొమురయ్య, గడ్డి మల్లయ్య, బొబ్బిలి మోహన్, శీలం లచ్చయ్య, కురుమల జగ్గయ్య, చిగురు సూర్యం, గోనె రాము, ఉప్పరి కుమార్, కొయ్యడ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం


సన్మానిస్తున్న కుందనపల్లి గ్రామస్తులు

రామగుండం: ఇటీవల అంతర్గాం ఎస్సైగా బదిలీపై వచ్చిన బోయ వెంకట్‌ను ఆదివారం కుందనపల్లి గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో కుందనపల్లి యువకులు సంగనవేణి శేఖర్, సుంకరి రవి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్మారం: మండల కేంద్రంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం టీఎల్‌ఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని అధ్యాపకుల సమస్యలపై పోరాటం చేస్తున్నామన్నారు. అధ్యాపకుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ పరిష్కార మార్గం చూపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. టీఎల్‌ఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త పోకల నాగయ్య, రాష్ట్ర నాయకులు సత్యనారాయణరాజు, కందూకూరి భాస్కర్, దామోరపెల్లి మదన్‌మోహన్, ఎలిగేటి మహేందర్, బైరి చంద్రమౌళి, గాజుల చంద్రయ్య, సురేందర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


పనులను ప్రారంభిస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతియాదవ్, ఎంపీపీ దేవక్క

రామగిరి: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని రత్నాపూర్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ఎంపీపీ ఆరెల్లి దేవక్కతో కలిసి ప్రారంభించారు. గత ప్రభుత్వాలు హామీలకే పరిమితమయ్యాయని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేసేందుకు మంత్రి శ్రీధర్‌బాబు కట్టుబడి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొడ్డ బాపు, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు బండారి సదానందం, నాయకులు వనం రాంచందర్‌రావు, బొల్లపల్లి స్వామిగౌడ్, కొండ అంజన్న, తీగల సమ్మయ్య, మట్ట రాజ్‌కుమార్, అవినాష్ పాల్గొన్నారు.

హరిహర దేవాలయంలో బ్రహ్మోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని హరిహర దేవాలయంలో 20, 21, 22 తేదీల్లో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఎర్రబాటి రాజేశ్వర్‌రావు తెలిపారు. 20వతేదీన మంగళవారం ఉదయం గణపతి పూజతో ప్రాంభమై గౌరీ పూజ స్వస్తి పుణ్యాహవచనం, నవగ్రహ యోగిని క్షేత్రపాలక వాస్తు సర్వతోభద్ర మండప, ఆరాధన మంగళ హారతి, మంత్రపుష్పం, సాయంకాల పూజ, మంగళహారితి మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, 21న ప్రాతక్కాలపూజ, మూలమూర్తులకు మహాస్నాపన అభిషేకం, మంగళ హారతి మంత్రపుష్పం స్థాపిత దేవత హవణం సాయంకాల పూజ, మంగళహారతి మంత్రపుష్పం, 22న ఉదయం ప్రాత:కాలపూజ మంగళ చండీ హవనం రాత్రి శ్రీపద్మావతి అలివేలు మంగా సహిత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతాయని ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

గోదావరిఖనిటౌన్: 20ఏళ్ల క్రితం స్థానిక సంజయ్‌గాంధీనగర్‌లోని శ్రీరాజరాజేశ్వర హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదువుకున్న 2002–2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఎస్‌ఏ బ్యాంకెట్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్నపిల్లల్లా అందరూ కలిసి ఆడిపాడారు. అనంతరం తమకు పాఠాలు నేర్పిన గురువులు చల్లా ప్రవీణ్‌కుమార్, మస్తాన్ షరీఫ్, ఆకుల శ్రీనివాస్, కుమార్, తిరుపతి సన్మానించారు. తమ గురువు కనుకయ్య స్వర్గస్తులు కాగా ఆయన సతీమణి టీచర్ రాధకు పూర్వ విద్యార్థులు రూ.50వేలు, ఉపాధ్యాయులు రూ.20వేలు మొత్తం రూ.70వేల నగదు అందించారు. కార్యక్రమంలో సురేశ్, రాజేశ్, సంజీవ్, శారద, సుమలత పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఉద్యోగులకు నష్టం కలిగించే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతికుమారి అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గెస్ట్ తదితర సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ డైరీ, క్యాలెండర్లను పంపిణీ చేశారు. నాయకులు డేనియల్, శ్రీధర్, నర్సయ్య, సుచరిత, వెంకటేశ్, ప్రణయ్ ఉన్నారు.

సమ్మక్క–సారలమ్మ జాతరకు ఏర్పాట్లు


కమాన్‌పూర్: గుండారంలో ముస్తాబైన గద్దెలు


జూలపల్లి: కొనసాగుతున్న రోడ్డు పనులు

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో 21 నుంచి నుంచి 23 వరకు జరిగే సమ్మక్క జాతర నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. జాతర జరిగే పరిసర ప్రాంతాలను చదును చేయించి గద్దెలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగు నీరు, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నారు. 21న కోయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి జాతర ఉత్సవాలను ప్రారంభిస్తారు. 21న సారలమ్మను రాజేంద్ర నగర్ నుంచి, 22న గుండారం రిజర్వాయర్ సమీపంలోని గౌరిగుండం నుంచి సమ్మక్కను గద్దెలకు తీసుకువస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ముమ్మరంగా జాతర పనులు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి–ఎలిగేడు గ్రామాల సరిహద్దున గల పెండ్లి పోరుగుట్ట వద్ద జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడ సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతర జరిగే ప్రాంతంలో భూమిని చదును చేసి చలువ పందిళ్లను వేయిస్తున్నారు. పెండ్లి పోరుగుట్ట వద్దకు జాతరకు వచ్చే భక్తులకు ఎలిగేడు పరిధిలోని కెనాల్ వెంట రోడ్డుకు గుంతలు పూడ్చివేయించి రోడ్డును బాగుచేస్తామని ఉత్సవ కమిటీ పేర్కొంది.

చకచకా ఏర్పాట్లు


ఎలిగేడులో చలువ పందిళ్లు

జూలపల్లి: సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణకు మరో రెండు రోజుల ఉండడంతో నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాతర కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు. మండల పరిధిలోని గ్రామాల నుంచే కాక ఉమ్మడి జిల్లా కేంద్రం నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అబ్బాపూర్ పెద్దమ్మ ఆలయం నుంచే సమ్మక్క జాతర వరకు రూ.కోటి నిధులతో మంజూరైన రోడ్డును గుత్తేదారు భక్తుల కోరిక మేరకు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. జాతర జరిగే సమయంలో రోడ్డు ఇబ్బందులు లేకుండా కృషి చేసిన మాజీ సర్పంచ్‌లు ఈర్ల మల్లేశం, లక్ష్మీనారాయణకు జాతర కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఆటో ట్రాలీతో స్ప్రే చేస్తున్న కార్మికులు

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు కాలనీల్లో దోమలు స్ప్రే చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ తెలిపారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో ఆటో ట్రాలీ ద్వారా స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీల్లో సీజనల్‌వ్యాధుల బాధితులు ఉన్నారని, వాటి బారిన పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా స్ప్రే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు.

ఎండుతున్న మొక్కలు



సుల్తానాబాద్: రాజీవ్ రహదారి మధ్యలో నాటిన మొక్కలు వేసవికాలం ప్రారంభంలోనే ఎండిపోతున్నాయి. సదరు కాంట్రాక్టర్ నిత్యం మొక్కలకు నీటిని అందించాల్సి ఉండేది. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పూసాల వద్ద నాటిన మొక్కలు ఎండిపోతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నాటిన మొక్కలతో పాటు ఎండిన మొక్కల స్థానంలో మరో మొక్క నాటాలని పర్యావరణ ప్రియులు కోరుతున్నారు. హరిహర

కుక్కల దాడిలో గేదెల మృతి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను, జంతువులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. లక్ష్మీపురం, ఎల్కలపల్లిగేట్ గ్రామంలో శనివారం రాత్రి గేదెలపై కుక్కలు దాడి చేయడంతో మచ్చ శంకరయ్య, కటికె కిషన్, గుంటూరు శ్రీనివాసుకు చెందిన గేదెలు మృతి చెందాయి. బాధితులు రామగుండం కమిషనర్, రామగుండం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నియామకం



పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లికి చెందిన గరిగంటి నర్సింహరాజును నియమించినట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొలిపాక మధు, ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బియ్యం అందజేత

పెద్దపల్లిరూరల్: పట్టణానికి అడిచర్ల మల్లేశ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకుడు అల్లం వినోద్‌రెడ్డి సమకూర్చిన 50కిలోల బియ్యాన్ని ఆదివారం అందించారు. నిరుపేద కుటుంబీడైన మల్లేశ్‌కు అండగా నిలిచిన వినోద్‌రెడ్డికి సభ్యులు జాకీర్, కరుణాకర్, రాము, మెహరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

జాతర నిర్వహణకు సహకరించాలి


మాట్లాడుతున్న సీఐ కృష్ణ

పెద్దపల్లిరూరల్: సమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని పెద్దపల్లి సీఐ కృష్ణ అన్నారు. మండలంలోని తుర్కలమద్దికుంట, హన్మంతునిపేట జాతర నిర్వహణ కమిటీ సభ్యులతో చర్చించి పలు సూచనలు చేశారు. జాతర సమయాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. జాతర నిర్వహణ కమిటీ సభ్యులు సైతం అప్రమత్తంగా ఉంటూ అనుమానితులు కనిపిస్తే, ఇబ్బందులు సృష్టించేందుకు ఎవరైనా యత్నించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. జాతర సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తుర్కలమద్దికుంట జాతర కమిటీ చైర్మన్ ముత్యాల రాజయ్య, హన్మంతునిపేట చైర్మన్ సుధాకర్‌రావు ఉన్నారు.

మేడారం తరహాలో కొలనూర్ జాతర


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై అశోక్‌రెడ్డి

ఓదెల: మేడారం తరహాలో కొలనూర్ సమ్మక్క జాతర జరుగుతుందని పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఓదెల మండలం కొలనూర్ సమ్మక్క జాతరను ఎస్సై పరిశీలించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ జాతర దర్శనం కోసం వచ్చే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి చైర్మన్, పాలకవర్గ సభ్యులతో మాట్లాడారు. వాహనాల పార్కింగ్, నీడ సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, ఫ్లెక్సీల ఏర్పాట్లు గురించి వివరించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జాతర చైర్మన్ దేవిడి శ్యాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, మాజీ సర్పంచు ఢిల్లీ శంకర్, మాజీ ఎంపీటీసీ పర్శ రమేశ్, పాలకవర్గసభ్యులు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు


ప్రారంభానికి నోచుకోని వాటర్ ప్లాంట్

జ్యోతినగర్: లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని లక్షణంగా వదిలేశారు. ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ నిధులతో హన్మకొండలోని ఓ స్వచ్ఛంద సంస్థ రామగుండంలో మూడు ప్రాంతాల్లో మూడు మంచినీటి శుద్ధి కేంద్రాలను నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకోగా ఎన్టీపీసీ రామగుండం సంస్థ సీఎస్సార్ నిధులు విడుదల చేసింది. మూడు ప్లాంట్లలో ఒకటి రామగుండం మున్సిపల్ కార్యాలయం వద్ద, లక్ష్మీనగర్‌లో మరొకటి, ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో ఒకటి నిర్మించాల్సి ఉంది. మున్సిపల్ కార్యాలయంలోని వాటర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయింది. లక్ష్మీనగర్‌లో స్థలం ఇంకా గుర్తింపు కాలేదు. ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని వాటర్ ప్లాంట్ అసంపూర్తిగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న నంబూద్రి గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామంలోని శ్రీసంతోషిమాత ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కేరళకు చెందిన బ్రహ్మశ్రీ సంజీవ్ నంబూద్రి గురుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేశారు. శాస్త్రోక్తంగా శ్రీనంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో అష్టదవ్య గణపతి, సుకృత, నవగ్రహ, మహాచండీ హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గండి వసంతలక్ష్మి-సదానందం దంపతులు, శ్రీసంతోషిమాత భక్తజన బృందం, భక్తులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపైనే లారీల నిలిపివేత


రామగుండం బైపాస్ రాజీవ్ రహదారిపై నిలిపి ఉన్న లారీలు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- వెనుక టైర్లతో కూలుతున్న డివైడర్లు

రామగుండం: రామగుండం బైపాస్ రాజీవ్ రహదారిపై లారీలను యథేచ్ఛగా నిలుపుతుండడంతో కరీంనగర్ వైపు నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రామగుండం బైపాస్ మూలమలుపు వద్ద లారీలను నిలుపుతుండడంతో కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే భారీ వాహనాలు మూల తిరిగే క్రమంలో అదుపు తప్పి లారీలను ఢీకొట్టే ప్రమాదం ఉందంటున్నారు. కాగా భారీ పొడవైన వాహనాలు (ట్రాలీలు)మలుపు తిరిగే క్రమంలో స్థలం సరిపోక తక్కువ స్థలంలోనే తిప్పడంతో ట్రాలీ వెనుక టైర్లు డివైడర్లకు తాకడంతో కూలిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు చోద్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నారు. ఇప్పటికైనా రాజీవ్ రహదారిపై లారీలు పార్కింగ్ చేయకుండా చూడాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు చేపట్టి రహదారి భద్రతా చర్యలు పాటించేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ ఎంపీపీ


గాయపడిన వ్యక్తిని వాహనంలోకి ఎక్కిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన వాహనంలో తరలించి ఆసుపత్రిలో చేర్చారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన బొల్లికొండ మల్లయ్య మండలంలోని గంగారం శివారులో బైక్‌పై వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. అటువైపు వెళ్తున్న మాజీ ఎంపీపీ చూసి క్షతగాత్రుడిని తన సొంత వాహనంలో కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స చేయించాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లికి తరలించారు. ప్రమాదానికి కారణం తెలియలేదు.

సమ్మక్కకు ఎత్తు బంగారం మొక్కులు



జ్యోతినగర్: సమ్మక్క తల్లికి భక్తులు బంగారం మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో భక్తులు కిరాణ దుకాణాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన త్రాసులో బంగారం(బెల్లం) తులాభారం వేసి పంచిపెట్టారు.